

అంట కాగితే.. అడ్డకత్తెరే!



అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పాలనా వ్యవహారాలపై దృష్టి పెట్టింది. ఒకవైపు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమల్లోకి తేవడం, మరోవైపు గాడి తప్పిన అధికార యంత్రాంగాన్ని సక్రమ మార్గంలో పెట్టడం, ప్రాధాన్యత అంశాలుగా తీసుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్రస్థాయిలో ఓ వైపు మార్పులు, చేర్పులు చేసినట్టుగానే సమాంతరంగా జిల్లా స్థాయిలోను మార్పులు కొనసాగించడానికి అంతర్గత కసరత్తు ప్రారంభమైంది. జిల్లా స్థాయి అధికారులు వ్యవహారశైలి, ఎంతకాలం నుంచి పని చేస్తున్నారు, గడిచిన కొన్నాళ్ళుగా అనుకూలత, వ్యతిరేఖతల వంటి అంశాలపై లోతట్టుగా ఆరా తీస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎక్కడికక్కడ స్థానిక అధికారులను మార్చి పొరుగు జిల్లా అధికారులను నియమించిన నేపథ్యంలో వీరందర్ని నెలాఖరు నాటికి వారి సొంత స్థానాలకు తరలించిన తర్వాతే ప్రక్షాళన ఆరంభమవుతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

జిల్లా స్థాయిలో మార్పులు, చేర్పులకు వీలుగా సంకేతాలు

- వైసీపీని భుజంపై మోసిన వారిలో అత్యధికులకు చెల్లుచీటి
- ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులతోనూ ఇదే వైఖరి
- కలెక్టర్ దగ్గర నుంచి అర డజను అధికారుల మార్పు తప్పకపోవచ్చు
- పక్షం రోజుల్లోనే పూర్తికి తుది కసరత్తు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గడిచిన కొన్నాళ్ళుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా మొండివైఖరితో వ్యవహరించిన అధికారులు ఎవరు..? అధికారపక్షం డైరెక్షన్‌లోనే అన్నింటిని చక్కబెట్టిన వారు ఎవరు..? అధికార హోదాలో పార్టీ ముద్రవేసుకుని అంట కాగిన వారు ఎవరు..? ఇలాంటి అంశాలు అన్నింటిపైన కూటమి ప్రభుత్వం అంతర్గత ఆరా ఆరంభించింది. గత ఐదేళ్ల కాలంలో దఫదఫాలుగా జిల్లా యంత్రాంగంలో మార్పులు, చేర్పులు జరిగాయి. ఎన్నికలకు ముందు కేవలం అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే వారిని ఆయా పదవుల్లో నియమించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ సలహాదారుల డైరెక్షన్‌లు, సూచనల మేరకే వీరంతా మునిగితేలారు. న్యాయబద్ధంగా వ్యవహరించాల్సిన ఇంకొందరు పక్క చూపులు చూశారు. పరోక్షంగా అధికార పార్టీకి కలిసివచ్చేలా వ్యవహరించిన సందర్భాలు లేకపోలేదు. దిగువ స్థాయిలో తహసీల్దార్ల నుంచి ఎస్ఐ, సీఐల వరకు ఇదే వైఖరిని అవలంభించిన వారు ఎంతమందో. కొందరైతే అధికార పక్షానికి చెందిన స్థానిక నేతలు చెప్పిందే వేదం. వారు చెప్పేతేనే కేసు నమోదు, లేకుంటే లేదు. ఇంతలా పక్షపాత ధోరణితో అవలంభించిన వారు ఎందరో... ఇలాంటి వారందరిపైన జనం తీవ్రస్థాయిలో మండిపడుతూ ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసినా దిక్కూమొక్కూ లేకుండా పోయింది. కనీసం మంత్రులు సైతం ఇలాంటి ఫిర్యాదు చేయడానికి ఎవరైనా సాహసిస్తే సొంతపార్టీ వారిని కూడా ఉపేక్షించేవారే కాదు. ప్రతిపక్షానికి చెందిన వారు అయితే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. ప్రత్యేకించి ఎన్నికల టీమ్‌గా కొందర్ని ఎంపికచేసి మరీ జిల్లాకు రప్పించారు. ఈ వ్యవహారంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన వారు సీఎంవోలో ఉన్న కొందరు సీనియర్ అధికారులు కావడం సమాంతరంగా ఇంకొందరు ప్రభుత్వ సలహాదారుల జోక్యం కావడం, అనివార్యంగా మారి వారి సిఫార్సులే చెల్లుబాటు అయ్యాయి. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టుబట్టి సిఫార్సు చేస్తే ఒకప్పుడు అవి మాత్రమే చెల్లుబాటు అయ్యేవి. జగన్ ఐదేళ్ల పాలనలో అంతా రివర్స్. చెప్పుకొందామంటే సీఎం కలవరు... విన్నవిద్దామంటే అధికారులకు పట్టనే పట్టదు. చేసేది లేక ఎమ్మెల్యేలు ఒకానొక సందర్భంలో మౌనం దాల్చి ఎన్నికల ముందు కొంతలో కొంత జోక్యం చేసుకునే ప్రయత్నం చేసి విఫలం అయ్యారు. ఇలాంటి తరుణంలో ఎన్నికలకు ముందు జిల్లాకు సంబంధించి కొన్ని నియోజకవర్గాల్లో పోలీసుల వైఖరి ఏకపక్షంగానే సాగింది. అధికారులంతా వైసీపీ అనుకూల సంకేతాలకే స్పందించేవారు. ఎక్కడా దాడులు జరిగినా కక్ష పూరితంగా వ్యవహరించినా పార్టీపరంగా రెచ్చగొట్టి గాయపరిచినా వీటిపై ఫిర్యాదులు వస్తే మాకేం తెలియదు అన్నట్టుగా తిరస్కార ధోరణే అవలంభించారు.

రెండేళ్లు దాటిన వారి సంగతేంటి?

జిల్లాలో గడిచిన రెండేళ్లుగా పాలనా యంత్రాంగంలో కీలకపాత్ర వ్యవహరించిన వారిలో కొందర్ని రాబోయే పక్షం రోజుల్లో బదిలీ చేసే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఇప్పటికే రెండేళ్లు పూర్తయింది. ఎన్నికలకు ముందు ఆయనను బదిలీ చేస్తారని ప్రచారం సాగినా అప్పట్లో ఎందుకనో ఆ ప్రస్తావన కాస్త అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఎన్నికల్లో తమ వారే జిల్లా స్థాయిలో లీడ్ చేయాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం ఉన్నందున అప్పట్లో కలెక్టర్ బదిలీ ప్రస్తావన నిలిచిపోవడం ప్రధాన కారణంగా కనిపించింది. కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ బదిలీ అంశం మళ్ళీ తెరపైకి వస్తోంది. ఎలాగో రెండేళ్లు దాటినా వారిలో అనేకమందిని మార్చడం లేదా కొత్త ప్రాంతాలకు బదిలీ చేయడం అనివార్యంగానే భావిస్తున్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ నియమితులైన తర్వాత ఆయనతో పాటు వివిధ శాఖల హెచ్‌వోడీలు దాదాపు 15 మందికి పైగానే ఇప్పటివరకు జిల్లాలో కొనసాగుతూ వచ్చారు. వీరిలో కొంతమంది గడిచిన మూడేళ్లుగా జిల్లానే అంటిపెట్టుకుని ఉన్నారు. ఇలాంటి వారిలో అనేకమందిని స్థానభ్రంశం చేసే అవకాశాలు లేకపోలేదు. తొలుత రాష్ట్రస్థాయిలో మార్పులు, చేర్పులు కొనసాగించడంతో పాటు సమాంతరంగా జిల్లాస్థాయిలో అదేతరహాలో మార్పులు కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు కొత్తగా మంత్రివర్గంలో చోటు కల్పించిన వారందరికి ఆయా శాఖలను కేటాయించినందున వీరంతా ఆయా శాఖలపై పట్టు బిగించేందుకు ఎలా లేదన్నా మరో 15 రోజులు పడుతుంది. ఆలోపే అంతర్గత నివేదిక రప్పించుకుని ఎవర్ని మార్చాలో, ఎవర్ని మార్చకూడదో ఎన్నికైన మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాత వీటన్నింటిని క్రోడీకరించి ఆ తదుపరే ప్రక్షాళకు దిగాలనే సంకేతాలు ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మార్పులు, చేర్పులు అనంతరమే దిగువ స్థాయి అధికారులపై దృష్టి పెట్టవచ్చని ఇంకొందరు చెప్తున్నారు.

వాళ్ళంతా వెనక్కి వెళ్లిన తరువాతే..

ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక అధికారులు అందర్ని పొరుగు జిల్లాలకు రెండునెలల క్రితమే బదిలీ చేశారు. తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, డిఎస్పీలు, రెవెన్యూ అధికారులు కీలక విభాగాల్లో ఉన్న వారందర్ని మార్చేశారు. వీరంతా పోలింగ్‌లోనూ తదుపరి జరిగిన కౌంటింగ్‌లోనూ కీలక భూమిక పోషిం చారు. గడిచిన పది రోజుల క్రితం ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో అప్పట్లో వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అధికారులను తిరిగి వారి స్వస్థలాలకు మరో 15 రోజుల్లోపు పంపేయబోతున్నారు. సాధారణంగా సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా స్థానిక అధి కారులకు అవకాశం లేకుండా చేసి వారి స్థానంలో కొత్త అధికారులను నియమించి ఎన్నికలు నిర్వహించడం రివాజు. ఈసారీ అదే జరిగింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్పులు, చేర్పులు అన్నివార్యంగా మారాయి. తహసీల్దార్లు, ఎస్ఐలు, అత్యధికులు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు గతంలో అత్యంత దగ్గరవారిగా వ్యవహరించారు. వారు చెప్పిందే వేదంగా అమలు చేశారు. ఇప్పుడు తిరిగి అటువంటి వారందర్ని యథావిధిగా ఆయా స్థానాల్లోనే నియమించాల్సి ఉంది. ఇప్పటికే వైసీపీ ముద్రబోయి ఆ స్థానంలో పెద్దఎత్తున ప్రక్షాళన చేస్తున్న తరుణంలో వైసీపీకి అంటకాగిన అధికారులను గుర్తించి వారిలో కొందర్ని తప్పించే ప్రయత్నాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పోలీస్ రేంజ్ పరిధిలో ఎన్నికల సమయంలో ఎవరెవరు ఎక్కడెక్కడకు వచ్చింది. వారిలో వారందర్ని తిరిగి ఎప్పటిలోపు సొంత ప్రాంతాలకు పంపిస్తారనే దానిపై ఉన్నతాధికారుల నుంచి సంకేతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పాత అధికారులందరూ పాత స్థానాల్లోనే పదిలంగా స్థిరపడేందుకు వీలుగా కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు దర్శనం చేసుకున్నారు. మీరు ఎలా చెప్తే అలా చేస్తామంటూ కొందరైతే భరోసా ఇచ్చేశారు. సామాజిక వర్గాల వారీగా ఇంకొందరు రెండు అడుగులు ముందుకువేసి కొందరు కులపెద్దలతోనూ సిఫార్సు చేయించు కుంటున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటేనే మండల, డివిజన్, జిల్లాస్థాయిలో తొలుత కొంతమందికి మాత్రమే స్థానభ్రంశం చేసి మిగతా వారిని దఫాల వారీగా మార్చే అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుంటుంది.

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 14 : పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ఉన్న శాఖాపరమైన సమస్యలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సివిల్ సిబ్బంది, పలువురు వచ్చి తమ సమస్య లను ఎస్పీకి తెలిపారు.

నేటి నుంచి 'నేను బడికి పోతా'

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 14 : బడి బయట వున్న పిల్లలు, బడిలో నమోదు కాని 6-14 ఏళ్ల వయస్సు గల బాలబాలికలను గుర్తించి, వారిని బడిలో చేర్పేందుకు 'నేను బడికి పోతా' పేరిట ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15నుంచి 21వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్టు సమగ్రశిక్ష ఏపీసీ బి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 15న మండల కేంద్రాల్లో బడి ఉత్సవం-బాలికా ఉత్సవాలను నిర్వహించాలని, 18న ప్రత్యేక అవసరాలు గల బాలలను గుర్తించి సమీప భవిత కేంద్రాల్లో చేర్పించడం, 19న విద్యాసదస్సు, 20న సమాజంతో ఒక రోజు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వీటితో పాటు బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని జూలై 11వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలన్నింటికి సీఆర్పీలు, ఐఈఆర్పీలు, అంగన్‌వాడీ వర్కర్లు, కేజీబీవీ సీఆర్టీలు, గ్రామ వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు, ఎడ్యుకేషన్ అసిస్టెంటు, పార్ట్‌టైం ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని డీవైఈవోలు, ఎంఈవోలు, స్కూల్స్ హెచ్ఎంలను ఆదేశించారు.

20న ఐటీడీఏలో జాబ్‌మేళా

బుట్టాయగూడెం, జూన్ 14 : కేఆర్ పురం ఐటీడీఏ వైటీసీలో ఈ నెల 20వ తేదీ కాడ్‌బరీ, అపోలో టైర్స్ వారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పీడీ ఎం.సూర్యతేజ తెలిపారు. కాడ్‌బరీ కంపెనీలో పనిచేయడానికి ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించి 18-21 ఏళ్ల నిండిన యువతీ యువకులు అర్హులన్నారు. అపోలో టైర్స్‌లో పనిచేయడానికి డిగ్రీ, డిప్లొమా, బి.టెక్ 2020, 21, 22, 23, 24 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి 18-23 ఏళ్లు నిండినవాళ్లు అర్హులన్నారు. ఆసక్తి గల గిరిజన యువతీ యువకులు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 20న జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.

జల వనరులు.. ఇక పరుగులు




- నిమ్మలకు ప్రాధాన్యత శాఖ కేటాయింపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు జల వనరుల శాఖను కేటాయించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ నిమ్మలకు దక్కింది. గడచిన ఐదేళ్లలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు పడకేశాయి. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పట్టించుకోలేదు. కార్యదక్షత కలిగిన నిమ్మలకు జలవనరుల శాఖ కేటాయించడంతో అందరిలోనూ ఆశలు రేకెత్తాయి. నీటి ప్రాజెక్టులు పరుగులు తీయనున్నాయి. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్ట్ కొలిక్కి రానుంది. కేంద్ర సహకారం అందనుంది. ఉభయ గోదావరి జిల్లాలకు రబీ స్థిరీకరణ కావాలంటే పోలవరం ప్రాజెక్ట్ ఒక్కటే మార్గం. పనులు నిర్వహించడంలో నిత్యం అధికారులు వెంటపడడం నిమ్మల నైజం. పని అయ్యేంత వరకు అదే ధ్యాసతో ఉంటారు. వార్తల్లోనూ నిలుస్తుంటారు. పాలకొల్లుకు శ్మశాన వాటిక నిర్మాణానికి కాంట్రాక్టరు రాకపోవడంతో అక్కడే మూడు రోజులు నిద్రించారు. అపోహలను తొలగించారు. శ్మశాన వాటిక నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఇలా పని విషయంలో పట్టుదలతో ఉంటారు. అందుకే జలవనరుల శాఖను చంద్రబాబు ఏరికోరి నిమ్మలకు కేటాయించారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ కూడా సస్య శ్యామలం కానుంది. విశాఖకు మంచినీరు అందించే అవకాశం ఉంది. పరిశ్రమలకు ఆస్కారం ఉంటుంది. తాడిపూడి, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వాటికి మోక్షం లభించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు పూర్తి స్థాయిలో అందనున్నాయి. వాణిజ్య పంటలు మరింతగా విస్తరించనున్నాయి. నిమ్మలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న పోలవరం, చింతలపూడి, తాడిపూడి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన బాధ్యత పడింది. అభివృద్ధి విషయంలో నిధులు రాబట్టేందుకు నిమ్మల పోరాటం చేస్తుంటారు. ఇప్పుడు పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాకు అవసరమైన ప్రాజెక్టులకు నిధులు రాబట్టడంలోనూ చొరవ చూపుతారన్న నమ్మకం జిల్లా ప్రజల్లో నెలకొంది. మరో వైపు డెల్టా ఆధునికీకరణ ముందడుగు వేయడం లేదు. కనీసం వేసవి పనులు చేపట్టడం లేదు. బిల్లులు మంజూరు చేయడం లేదు. వేసవి పనులకు దిక్కు లేకుండా పోయింది. ఇవన్నీ సక్రమంగా పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడింది. జిల్లా అవసరాలను గుర్తించి డెల్టా ఆధునీకీకరణకు పెద్దపీట వేయనున్నారు. వైసీపీ హయాంలో నీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. పోలవరం ప్రాజెక్ట్ కనీస నిర్మాణానికి నోచుకోలేదు. గత తెలుగుదేశం హయాంలో 72శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీలో ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారు. తాజాగా ప్రాజెక్టులన్నీ పరుగులు తీయనున్నాయన్న ఆశలు జిల్లా ప్రజల్లో నెలకొన్నాయి. మంత్రి నిమ్మలపై ఆ బాధ్యత ఉంది.

గృహ 'సారథి'పై బృహత్తర బాధ్యత



- కొలుసు పార్థసారథికి కీలక హౌసింగ్, పౌర సంబంధాల శాఖల కేటాయింపు

(నూజివీడు):

రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థ సారథికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత కీలకమైన శాఖలను అప్పగించారు. ఎన్నికల సమయంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ బాధ్యతను తూచా తప్ప కుండా నెరవేర్చే అర్హత కొలుసుకు ఉందనే భావనతో గృహనిర్మాణ శాఖను అప్పగించారు. వైసీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ఆ అవినీతిని వెలికి తీయడంతోపాటు నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వ సంక్షేమాన్ని వారి కందేలా చూసేందుకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం పనికి వస్తుందనే ఆలోచనతోనే సంబంధిత శాఖను సారథికి అప్పగించినట్టు తెలుస్తోంది. ఇదే సందర్భంలో ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు సంబంధించిన పౌర సంబంధాల శాఖను సైతం సారథికే అప్పగించడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా 13 వేల పంచాయతీలు ఉండగా అందులో 17,005 గృహ నిర్మాణశాఖ కాలనీలను 71,811 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. కాలనీల్లో అగ్రభాగం కొండ గట్లు, శ్మశాన భూములు, చెరువులు, పనికిరాని చౌడు భూముల్లో నివేశనా స్థలాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడక్కడ రైతుల వద్ద నుంచి భూములను కొనుగోలు చేసినా వాస్తవ మార్కెట్ రేటుకు మించి అనేక రెట్లు పెంచి కొనుగోలు చేసి వందలాది కోట్లాది రూపాయల అక్రమాలకు గత ప్రభుత్వం పాల్పడిందనేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం గృహ నిర్మాణాలను పూర్తిచేసి ఒక్క రూపాయికే అక్కా చెల్లెమ్మలకు అందిస్తానని ఆర్భాటంగా ప్రకటించినా తొలుత ఆ భవన నిర్మాణాలను ఓ కాంట్రాక్ట్ సంస్థకు ఇచ్చి ఒక్కో ఇంటికి రూ.35వేల డిపాజిట్లను లబ్ధిదారుల నుంచి చెల్లించేలా చేశారు. అనంతరం సంబంధిత భవన నిర్మాణాలను లబ్ధిదారులే చేపట్టాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక ముచ్చటగా మూడోసారి జగనన్న కాలనీల్లో గృహాలు రెండు అంచెలుగా చేపట్టడం జరుగుతుందని చెప్పి జగన్ ప్రభుత్వం చేతులెత్తేసింది. మొదటి దశను 2019 జూలైలో చేపట్టగా, రెండో దశను 2020, డిసెంబరు 25న ప్రారంభించింది.

ఇక రెండో దశలో గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసి దాదాపు 80 శాతం పూర్తి చేసిన అర్బన్ హౌసింగ్ స్కీమ్ టిడ్కోను (పీఎంఏవై) ను చేరుస్తూ 28.30 లక్షల ఇళ్ళు నిర్మిస్తున్నట్టు చెప్పింది. జగనన్న కాలనీల్లో భూముల కొనుగోళ్ళు, మౌలిక సదుపాయాల పేరిట వైసీపీ అనుంధ అనుచరులకు భారీగా దోచిపెట్టిందనే ఆరోపణలు ఉన్నాయి. టిడ్కో గృహ లబ్ధిదారుల నుంచి రుణాలు సేకరించి ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుని లబ్ధి దారులను రుణాల ఊబిలోకి నెట్టివేసిన విషయమై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పేదల సొంతింటి కలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వ్యవహరించడంతో పాటు అక్రమాలను వెలికితీసి కోట్లాది రూపాయలు దోచు కున్న అక్రమార్కుల నుంచి సంబంధిత నిధులను రికవరీ చేయాల్సిన బాధ్యత పార్థ సారథి పైనే ఉంది. ప్రతి నియోజక వర్గంలోనూ జగనన్న కాలనీల పేరిట లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్లాటింగ్ చేసి, నిర్మాణాలు ప్రారంభించకుండానే వదిలివేసిన భూములు అనేకం ఉన్నాయి. సంబంధిత భూములకు ప్రత్యామ్నాయాలు చూపి పేదలకు సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ఈ ప్రభుత్వం పై ఉంది. మరో వైపు సమాచార, పౌర సంబంధాలశాఖ వైసీపీ పాలనలో గాడి తప్పింది. కేవలం ఓ పత్రిక, తనకు అనుకూలమైన మీడియాను భుజానికి ఎత్తుకున్న పౌర సంబంధాలశాఖ ప్రజల పక్షాన సమస్యలపై అక్షరగళాన్ని వినిపించే పత్రికలను, మీడియాలకు ప్రకటనలు విడుదల చేయకుండా అణచివేత ధోరణిని ప్రదర్శించింది. ఈ నేపథ్యం లో కొలుసుకు ఈ శాఖను అప్పగించడంతో సమాచార పౌర సంబంధాల శాఖను గాడిలో పెట్టాల్సి ఉంది.

ఎన్నికల పేమెంట్‌లో తిరకాసు!

- కొందరికి అంది ఇంకొందరికి అందక తికమక?
- ఆరా తీస్తే ఇస్తామంటూ దాటవేత
- ఇప్పటికీ తేలని ఎన్నికల లెక్కలపై ఆగ్రహం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎన్నికల కమిషన్ నిర్దేశిత మార్గదర్శక సూత్రాలను జిల్లా యంత్రాంగం విధిగా పాటించాల్సిందే. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలే తప్ప స్వీయ నిర్ణయాలకు అవకాశమే లేదు. నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి ఎక్కడికక్కడ ఎన్నికల టీమ్‌లను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులలో తనిఖీలు, నియమావళి ఉల్లంఘన ప్రక్రియ గమనించేందుకు తనిఖీలు, వీటన్నింటిని రికార్డు చేసేందుకు వీడియో గ్రాఫర్లు, రకరకాల టీమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి వ్యవహారాన్ని ఆయా నియోజకవర్గాల్లో ఏఆర్వోలు బాధ్యత తీసుకోవాలి. ఎన్నికలకు ముందు ఓటింగ్‌కు అనువుగా యంత్రాలు, సిబ్బంది తరలింపు వీలుగా వాహనాలు సమకూర్చారు. వీటిలో కొన్ని ప్రభుత్వానికి చెందినవి కాగా, మరికొన్ని ప్రైవేట్ వర్గాలకు చెందినవి. వీటన్నింటికి నోటిఫికేషన్ విడుదలైన దగ్గర నుంచి ఏ అవసరానికి అయితే వాహనం కావాలో ఆ మేరకు అద్దె చెల్లించాల్సి ఉంది. వాటిలో ప్రయాణించే వారికి టీఏ, డీఏ చెల్లించాల్సి ఉంది. మండలం, జిల్లా నియోజక వర్గాల వారీగా కొందరు పర్యవేక్షణ అధికారులు ఎప్పుడు వీలైతే అప్పుడు వాహనాల్లో తరలి వెళ్లేందుకు అనువుగా వాహనాలను సమకూర్చారు. ప్రైవేట్ స్కూల్ వాహ నాలను ప్రత్యేకించి ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేరవేయడంలో తిరిగి కౌంటింగ్ కేంద్రాలకు చేర్చడంలో భారీగా వినియోగించారు. ప్రభుత్వ వాహనానికి ఎలాగో రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు కనుక కేవలం ప్రైవేట్ వాహనాలకు మాత్రమే ఎంత చెల్లించాలన్నది అప్పట్లోనే నియోజక వర్గాల వారీగా ఒక నిర్ణయానికి వచ్చారు. ఎన్నికల కమిషన్ ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు వీలుగా కొంత బడ్జెట్‌ను కేటాయించింది. వీడియోగ్రాఫర్ల దగ్గర నుంచి సిబ్బందికి భోజన వసతి వరకు అన్ని బిల్లుల రూపంలోనే చెల్లించాల్సి ఉంది. సాధారణంగా ఎన్నికల సమయంలో పెట్టే ఖర్చుకు ఇంతకు ముందు అయితే ఆడిట్ ఉండేది కాదు. కాని ఈసారి ఎన్నికల్లో ప్రతి ఖర్చుకు జీఎస్టీ చెల్లించాలనే నియమం అమల్లోకి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ముగిసిన తర్వాత కూడా ఆయా నియోజక వర్గాల్లో చాలా మందికి బిల్లులు చెల్లింపు జరగనే లేదు.

కొంతమంది ఇప్పుడిప్పుడే ఆగ్రహం కట్టలు తెంచుకుంటూ ఉండగా వీధులకెక్కుతున్నారు. ఒక్క వీడియో గ్రాఫర్లను పరిగణలోకి తీసుకుంటే ప్రతి విషయంలోనూ వీడియో రికార్డు చేయాల్సి ఉండడం, వాటిని ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి రావడంతో కాల పరిమితిలోనే కొంతమందిని తీసుకున్నారు. రోజుకు ఇంత రుసుము చెల్లించి వారిని ఎన్నికల విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో ఇవ్వాల్సిన మొత్తంలో కొంత అడ్వాన్స్ చెల్లించారు. తీరా ఎన్నికలు ముగిసి చాలాకాలమైనా పనిచేసిన వీడియో గ్రాఫర్లు ఎవ్వరికి కొన్ని నియోజక వర్గాల్లో ఇంకా బిల్లులు చెల్లించలేదు. ఈ విషయం బహిర్గతమైనా అధికారులు మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. పోలింగ్ సామగ్రిని తరలించే సమయంలోనూ కొంతమందికి భోజనం అందక ఇబ్బందులు ఎదురైయ్యాయి. ఈ విషయాన్ని అప్పట్లోనే మీడియా బయటపెట్టింది. అయినా అలాంటి సమయాల్లో అంతా సర్దుకుపోయే పరిస్థితిలో ఉన్నందున దీన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. కాని ఎన్నికలు పూర్తి అయ్యి చాలాకాలం గడుస్తున్నా ఎన్నికల నిర్వహణ బిల్లులను సంబంధిత అధికారులు విడుదల చేసి సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఈ విషయంలోనూ ఇంకా దాటవేత వైఖరిలోనే ఉన్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే చింతలపూడిలో వీడియో గ్రాఫర్లు వీధులకెక్కారు. తక్షణం జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే సమస్య పరిష్కారం అయ్యేటట్లు కనిపిస్తోంది.



చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్నికల విధులు నిర్వహించిన వీడియోగ్రాఫర్లు (ఫైల్)

తగ్గని విద్యుత్ వినియోగం

- రుతుపవనాలు వచ్చినా పెరుగుతున్న వినియోగం.. డిమాండ్
- తప్పని విద్యుత్ అంతరాయాలు
- వాతావరణ మార్పులే కారణమంటున్న నిపుణులు



ఏలూరుసిటీ, జూన్ 14 : ఓవైపు నైరుతి రుతుపవనాలు వచ్చాయంటున్నారు.. అయినా వాతావరణంలో ఎటువంటి మార్పులు లేకపోవడం.. మరోవైపు వర్షాలు మందగించడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందే తప్ప ఏ మాత్రం తగ్గడం లేదు. వారం రోజుల్లో ఉష్ణోగ్రతల ఆధారంగా కొన్ని రోజుల్లో విద్యుత్ కోటా కన్నా వినియోగం అధికంగా ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వర్షాలకు అనానుకూల పరిస్థితులు ఏర్పడడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతూనే వస్తున్నాయి. విభిన్న వాతావరణం ఉండడంతో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదవుతున్నా.. ఎండ తీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. ఉక్కపోత విపరీతంగా పెరగడంతో గృహ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా వర్షాల జాడ మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఈ పరిస్థితులలో విద్యుత్ వినియోగం పెరుగుతూనే ఉంది. విద్యుత్ కోటాకు విద్యుత్ డిమాండ్‌కు వ్యత్యాసం ఉండడంతో ఒక్కొక్కసారి విద్యుత్ అంతరాయాలు తప్పడం లేదు. ఈ పరిస్థితుల కారణంగాను, సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడిన సమయాల్లోనూ అప్రకటిత విద్యుత్ కోతలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అమలవుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఉక్కపోతను భరించలేక ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం యధాతథంగానే ఉంది. పగటిపూట ఉమ్మడి పశ్చిమలోని పలు ప్రాంతాల్లో మబ్బుల వాతావరణం ఉన్నా ఉష్ణోగ్రత తీవ్రత కనిపించడంతో విద్యుత్ వాడకం పెరుగుతూనే ఉంది.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	విద్యుత్ కోటా (మిలియన్ యూనిట్లలో)	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)
జూన్ 7	19.925	19.958
జూన్ 8	20.376	19.404
జూన్ 9	22.499	19.565
జూన్ 10	23.281	20.534
జూన్ 11	20.180	20.962
జూన్ 12	21.703	21.668
జూన్ 13	21.225	21.902

తప్పని విద్యుత్ అంతరాయాలు

జిల్లాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌తో విద్యుత్ అంతరాయాలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతల తీవ్రత కారణంగా విద్యుత్ కోటా విడుదల చేసినా వినియోగం పెరుగుతూనే ఉంది. విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన సమయంలో మాత్రం విద్యుత్ కోటా కంటే తక్కువగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మొరాయిస్తుండడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఈదురుగాలులు ఎక్కువగా వీచిన ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జూన్‌లోనూ తగ్గని వినియోగం..

సాధారణంగా జూన్‌లో వర్షాలు కురవడం ఆరంభించిన తర్వాత విద్యుత్ వినియోగం తగ్గుతూనే ఉంటుంది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో జూన్ మూడో వారంలోకి అడుగిడినా విద్యుత్ వినియోగం అసాధారణంగానే ఉంది. ఇప్పటికైనా రుతుపవనాలు ప్రభావం కారణంగా వర్షాలు కురిస్తే విద్యుత్ వినియోగం తగ్గే అవకాశాలున్నాయి.

మలేషియాలో టీడీపీ సంబరాలు

ఆచంట, జూన్ 14 : ఆచంట మండలానికి చెందిన కొంతమంది టీడీపీ శ్రేణులు రెండు రోజులు క్రితం మలేషియా వెళ్లారు. అక్కడ ఉన్న ప్రపంచంలోనే ఎత్తైన రెండో టవర్ వద్ద కూటమి విజయం సందర్భంగా అక్కడ తెలుగు వారితో కలిసి టవర్ వద్ద టీడీపీ జెండా పట్టుకుని పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడాల శ్రీనివాస్, గంజా శ్రీనివాస్ పాల్గొన్నారు.



వచ్చే వారం మాధవాయిపాలెం రేవు పాట !

- నేడు జేఏసీ సమావేశంలో నిర్ణయం



నరసాపురం రూరల్, జూన్ 14: మాధవాయిపాలెం రేవు పాటను వచ్చే వారం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరం రేవు పాటను నిర్వహించలేదు. ఏప్రిల్ నుంచి పాత పాటదారుడే రోజువారీ పద్ధతిలో రేవును నిర్వహిస్తూ వస్తున్నారు. కోడ్ ముగియడంతో జిల్లా అధికారులు పాటకు పచ్చజెండా ఊపారు. ప్రారంభ ధర రూ.2.75 కోట్లుగా నిర్ణయించారు. జేఏసీ కమిటీ ఆమోదం తెలపగానే సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మరోవైపు రోజువారీ పద్ధతిలో రేవు నిర్వహణను చేపడుతున్న పాటదారుడు పెద్దమొత్తంలో బకాయి పడ్డారు, సుమారు రూ.25 లక్షలపైనే బకాయి ఉన్నట్లు, అతడికి నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో రమణారావు తెలిపారు. దీనిపై కూడా శనివారం జరిగే జేఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

వీఆర్వోల సమస్యలు రెవెన్యూ మంత్రికి తెలుపుతాం

ఏలూరు రూరల్, జూన్ 14 :వీఆర్వోల సమస్యలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళతామని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పక్షాన రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్న సత్యప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు తదితరశాఖల మంత్రులకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిదిండి, జూన్ 14 : కాళ్లపాలేనికి చెందిన అల్లాడి నాగరాజు ఇల్లు శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఇంట్లో వస్తు సామగ్రి, దుస్తులు, రేషన్, ఆధార్ కార్డులు, నగదు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. కైకలూరు ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. తహసీల్దార్ దశిక వంశీ, వీఆర్వో కోకా చంద్రశేఖర్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు..

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

తిరోగమనంలో ఏపీ నిట్

డైరెక్టర్‌గా చేరేందుకు డాక్టర్ దిలీప్ విముఖత

- సీట్ల కుదింపు.. ఎంటెక్ కోర్సుల నిలిపివేత
- వైసీపీ ప్రభుత్వ పాలనలో నిధులు అంతంత మాత్రమే



తాడేపల్లిగూడెం ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి కష్టకాలం దాపురించింది. సీట్లలో కోత పడింది. ఎంటెక్ కోర్సులు నిలిపివేశారు. రెగ్యులర్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్పీ రావును తొలగించినప్పటి నుంచి ఏపీనిట్‌ను పట్టించుకున్న వారు లేరు. వైసీపీ ప్రభుత్వం దీనిపై కనీస శ్రద్ధ చూపలేదు. రెండేళ్ల క్రితం ఏపీనిట్ సీట్ల సంఖ్య 700కు చేరింది. ఆ తర్వాత సరిపడా ఫ్యాకల్టీ లేరంటూ సీట్ల సంఖ్యను 480కి కుదించారు. డైరెక్టర్‌గా సూర్యప్రకాశ్‌రావు ఉన్నప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. సీట్ల సంఖ్యను పెంచారు. అడ్మిషన్‌లు కల్పించారు. ఆయనపై సీబీఐ కేసు నమోదు కావడంతో పక్కన పెట్టారు. ఆ తర్వాత కమిటీ వేసి ప్రత్యేక దర్యాప్తు చేశారు. జాతీయ స్థాయికి అనుకుగుణంగా డాక్టర్ సూర్యప్రకాశ్ రావు వ్యవహరించలేదంటూ డైరెక్టర్ బాధ్యతల నుంచి తొలగించారు. సకాలంలో కొత్త డైరెక్టర్‌ను నియమించలేదు. నాగపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ పడోలేను ఏపీనిట్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. డాక్టర్ పడోలే పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఏపీనిట్‌కు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు నాగపూర్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్ ఆర్ పేస్కీని ఏపీనిట్ డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర ప్రభుత్వం జూన్ 8వ తేదీకి గడువు విధించింది. అప్పటిలోగా ఏపీనిట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాలని డాక్టర్ దిలీప్‌కు కేంద్రం సూచించింది. డైరెక్టర్‌గా కేంద్రం నియమించిన తర్వాత డాక్టర్ దిలీప్ ఏపీనిట్‌ను సందర్శించారు. ఆ తర్వాత తన మనసు మార్చుకున్నారు. డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించలేదు. డైరెక్టర్ బాధ్యతలపై ఆసక్తి లేదంటూ డాక్టర్ దిలీప్ కేంద్రానికి స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జ్‌ల పాలనలో నిట్ తిరోగమనంలో పయనిస్తోంది.

ఐదేళ్లపాటు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ 2015లో ప్రారంభమైంది. దేశంలో ఏ నిట్‌కైనా ప్రారంభ దశలో 120 సీట్లు కేటాయిస్తారు. తాడేపల్లిగూడెంలో ఏపీనిట్‌కు మాత్రం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కృషితో కేంద్రం 480 సీట్లు కేటాయించింది. రాష్ట్ర విభజనతో ఏపీ విద్యార్థులు నష్టపోకూడదని కేంద్రం అంగీకరించింది. మొదటి ఏడాదే 480 సీట్లకు అడ్మిషన్లు కల్పించారు. శాశ్వత క్యాంపస్ కూడా తెలుగుదేశం హయాంలోనే ఏర్పాటు చేశారు. నిత్యం కేంద్రంతో సంప్రదింపులు జరిపి నిధులు రాబట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధ్యాసే లేకుండా పోయింది. ఆర్థికంగా వెనుక బడిన తరగతులకు పది శాతం కోటాను కేంద్రం అమలు చేయడంతో ఏపీనిట్‌కు అదనపు సీట్లు వచ్చాయి. తొలుత కేంద్రం ఏపీ నిట్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో సీట్లు పెంచేందుకు అంగీకరించలేదు. అప్పటి డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు చొరవతో సీట్లు పెంపునకు అంగీకరించింది. మొత్తంపైన 700 సీట్లకు ఏపీ నిట్ చేరుకుంది. ప్లేస్‌మెంట్స్‌లోనూ దేశంలోనే నంబర్ టూ స్థానానికి ఎదిగింది. డైరెక్టర్‌ను తప్పించిన తర్వాత ఇన్‌చార్జ్‌లు వచ్చారు. ఏపీ నిట్‌పై దృష్టి పెట్టలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోలేదు. ఫ్యాకల్టీని నియమించలేదు. వసతి సౌకర్యాలను పెంచలేదు. చివరకు సీట్లను కుదించేశారు.

తగ్గిన సీట్ల సంఖ్య..

సీట్ల సంఖ్య 700 నుంచి 480కి తగ్గిపోయింది. ఈ ఏడాది 480 సీట్లకు అడ్మిషన్‌లు కల్పించనున్నట్టు ఏపీనిట్ అధికారులు ప్రకటించారు. గతలో 700 సీట్లు ఉన్నప్పుడు రాష్ట్ర విద్యార్థులకు 350 సీట్లు లభించేవి. మిగలిన 50 శాతం సీట్లను ఇతర రాష్ట్ర విద్యార్థులతో భర్తీ చేసేవారు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. గతంలో దక్షిణాదిలోనే నంబర్ వన్ విద్యా సంస్థగా అవార్డు అందుకుంది. ఆ రికార్డులన్నీ ఇప్పుడు చెదిరిపోయాయి.

ఎంటెక్ కోర్సులు నిలిపివేత

గతంలో ఎంటెక్ కోర్సులను అమలు చేశారు. కేంద్రం అనుమతి తీసుకుని దాదాపు ఎనిమిది కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. ఇప్పుడు వాటిని కూడా ఎత్తివేశారు. ఇలా ఏపీనిట్ అంతా వెనుకడుగు వేస్తోంది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏపీ నిట్‌పై దృష్టి పెట్టాల్సి ఉంది. ఏపీనిట్‌లో రాజకీయ జోక్యం కూడా ఎక్కువగా ఉంటోంది. అది లేకుండా నివారించాలి. నిధులు రాబట్టాలి. వైసీపీ హయాంలో అంతంత మాత్రంగానే నిధులు ఇచ్చారు. అదనపు వసతులు కల్పించాలన్నా.. అకడమిక్ భవనాలు ఏర్పాటు చేయాలన్నా నిధులు అవసరం కానున్నాయి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినప్పుడే సాధ్యమవుతుంది. ప్రస్తుతం 172 ఎకరాల్లో ఏపీనిట్ విస్తరించి ఉంది. మరో 40 ఎకరాలు అవసరం కానున్నాయి. ఏపీ నిట్ ప్రతిపాదించింది. దానిని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దానిపైనా చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఏపీ నిట్‌కు మళ్లీ పూర్వవైభవం వస్తుంది.

తగ్గిన ప్లేస్‌మెంట్స్

రెగ్యులర్ డైరెక్టర్ ఉంటే ప్లేస్‌మెంట్స్ వస్తాయి. కంపెనీలు ఆసక్తి చూపుతుంటాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారులున్నారు. ప్లేస్‌మెంట్స్‌లోనూ ఏపీ నిట్ స్థానం పడిపోయింది. గతంలో వంద శాతం ప్లేస్‌మెంట్స్ సాధించే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు 75 శాతం సాధించడం కష్టమైపోతోంది. రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయలేకపోయింది. ప్రస్తుతం 75 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీలు ఉన్నారు. మిగిలిన వారంతా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్నారు. ఫ్యాకల్టీ కారణాన్ని చూపి సీట్లను తగ్గించేశారు.

గోవు పవిత్రమైనది.. వధించడం నేరం

భీమవరంటౌన్, జూన్ 14 :గోవు పవిత్రమైనదని, సాధు జంతువని అటువంటి గోవును వధించడం చట్టరీత్యా నేరమని, బక్రీద్ సందర్భంగా జంతుబలులు నిషేధించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లా జంతు సంరక్షణ సంఘం జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా రవాణా శాఖ విద్యాశాఖ, దిశ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో 'గోహత్య చట్టరీత్యా నేరం గోహత్యను మానండి' అంటూ అవగాహన ర్యాలీ, కరపత్రాల పంపిణీ జంతు సంరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్, జిల్లా జంతు సంక్షేమ సంఘం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ జంతు బలుల నిషేధంపై ప్రభుత్వ శిక్షలను వివరించారు. దిశా చట్టం డీఎస్పీ వి.మురళీకృష్ణ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎవరైనా గోవులను, జంతువులను వధిస్తే ప్రభుత్వ శిక్షలకు శిక్షార్హులని, కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా జంతు సంరక్షణ సమితి చెరుకువాడ రంగసాయి జంతు సంరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. సుంకర దాసు, నరహరిశెట్టి కృష్ణ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, ఎం.సుధారాణి తదితర శాఖల వారు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



గోహత్య నివారిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


గోవుల అక్రమ రవాణా చట్టవిరుద్ధం

- పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం క్రైం, జూన్ 14 : బక్రీద్ పండుగ ఈనెల 17వ తేదీ సందర్భంగా జిల్లాలో ఎవరైనా గోవులను, దూడలను అక్రమ రవాణా చేయడం, వధించడంగాని చేస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుం టామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పోలీసువారి ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గోవధ, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు, స్లాటర్ హౌస్ రూల్స్ ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకొంటామన్నారు. జంతు సంరక్షణకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక పర్యవేక్షకుడిగా, నోడల్ ఆఫీసర్‌గా భీమవరం దిశ డీఎస్పీ ఎస్.మురళీకృష్ణని నియమించామన్నారు.

ఆ రెవెన్యూ అధికారి రూటేవేరు

- ప్రతి పనికి ఓ రేటు.. ప్రైవేట్ వ్యక్తితో వసూళ్లు



నరసాపురం, జూన్ 14: జిల్లాలోని ఓ తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వసూళ్ళకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేశారు. పనికి ముందు కొంత, అయిన తరువాత మరికొంత చెల్లించాల్సిందే, అది కూడా చేతికి అంటకుండా ప్రైవేట్ వ్యక్తి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి ఈ కార్యాలయంలో సాగుతున్న వసూళ్లపై తీవ్ర చర్చ సాగుతోంది. అధికారులు, సిబ్బంది మారి కొత్తవారు వచ్చినా ఇదే తంతు. ఫ్యామిలీ సర్టిఫికెట్, జనన, మరణ, పట్టాదారీ పాస్ పుస్తకాలు, అనధికార లే-అవుట్‌కు సంబంధించి ఒక రేటు ఫిక్స్ చేశారు. ఎవరైనా సరే ఆ సొమ్ము చెల్లించాల్సిందే, లేక పోతే పని పెండింగ్ పడుతుంది. ఈ కార్యాలయంలో పనంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలు ఉండడంతో ఈ ఆధికారిదే ఇష్టారాజ్యంగా సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. ఈ ఆధికారి తీరు మారకపోవడం గమనార్హం. మరోవైపు కొత్త ప్రభుత్వంలోనూ ఇక్కడే కొనసాగిందుకు ఈ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలియవచ్చింది.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



సందీప్(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14: మద్యానికి బానిసై, కుటుంబానికి దూరమైన ఓ వ్యక్తి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాలివి.. యాగర్లపల్లికి చెందిన జి.సందీప్(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అతడికి వివాహమైన మూడు నెలలకే భార్యతో గొడవలు కావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మరింత ఎక్కువగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. కడకట్లలోని రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య ప్రయత్నం చేయగా ఆ సమయంలో వచ్చిన రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ జి. శ్రీహరిబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉంగుటూరు, జూన్ 14 : ఉంగుటూరు శివారులో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాలకృత్యాల నిమిత్తం రోడ్డు పక్కన ఆగి వున్న లారీని భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణ రావు (55) మోపెడ్ బైక్‌తో ఢీకొట్టిన విషయం తెలిసిందే. అతడి భార్య బేబిరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని చేబ్రోలు పోలీసులు తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబానికి అప్పగించినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

మైనర్ల వివాహం కేసులో ఇద్దరి అరెస్ట్

ఏలూరు క్రైం, జూన్ 14 : మైనర్లకు వివాహం చేసిన కేసులో ఇద్దరిని ఏలూరు మండలం సీఐ ఎస్.రాజశేఖరరెడ్డి, రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ఇద్దరు ప్రేమించుకుని వివాహేతర సంబంధం కొనసాగించారు. ఆ బాలిక రెండో నెల గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు ఇరువురు 2023 ఆగస్టు 26న వివాహం చేయడానికి ప్రయత్నించగా ఐసీడీఎస్ అధికారులు అడ్డుకుని వారిని బైండోవర్ చేశారు. అయితే ఆదేనెల 29వ తేదీన వివాహం జరిపేశారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ అధికారులు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువైపులా తల్లిదండ్రులతోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు 4వ, 5వ నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితులను కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.




గొల్లలకోడేరులో స్థలం వద్ద గుమిగూడిన జనం, పడగొట్టిన ప్రహరీ

గొల్లలకోడేరులో స్థల వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ.. పోలీసుల జోక్యంతో తగ్గిన ఉద్రిక్తత

పాలకోడేరు, జూన్ 14: గొల్లలకోడేరు గ్రామంలోని సంజనా ఎస్టేట్ వద్ద కోట్లు విలువ చేసే స్థలానికి సంబంధించి శుక్రవారం రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఉద్రిక్తతకు దారి తీసింది. పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి వెళ్లి ఇరువర్గాలను వివాద స్థలం నుంచి పంపించివేయడంతో గొడవ సర్దుమనిగింది. గ్రామంలోని సంజనా అపార్ట్‌మెం ట్ సమీపంలో సుమారు ఎనిమిది ఎకరాల స్థలాన్ని ఒక బ్యాంకు నుంచి వేలంపాటలో ముగ్గురు వ్యక్తులు దక్కించుకున్నారు. కానీ స్థల యాజమానులు కోర్టుకు వెళ్లడంతో అప్పటి నుంచి వివాదం నడుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకు నుంచి వేలం పాటలో దక్కించుకున్న వ్యక్తులు కొంతమంది అనుచరులతో వెళ్ళి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేసి స్థలానికి అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చివేశారు. స్థల యాజమానులు వారి అనుచరులతో వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదంతో పాటు కొట్టుకునేందుకు సిద్ధపడ్డారు. ఓ వర్గం కర్రలతో రావడంతో వెనకడుగు వేయడంతో కొట్లాట తప్పింది. మధ్యలో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చూశారు. ఇరువర్గాలు అంగీకరించడంతో ఉద్రిక్తత తగ్గింది. ముందస్తులో భాగంగా పోలీసులు ఆ వివాద స్థలం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశామని ఎస్ఐ తెలిపారు.

శేషాచలంపై అదుపుతప్పిన భక్తుడి కారు

- ధ్వంసమైన డివైడర్, కారు ముందుభాగం
- తప్పిన ప్రమాదం



ద్వారకాతిరుమల, జూన్ 14: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరిగే సమయంలో భక్తులు ఎవరూ లేకపో వడంతో పెనుప్రమాదం తప్పింది. ఈఘటన శేషాచలంపై ఉన్న శేషాద్రి గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలివి.. జంగారెడ్డిగూడెంకు చెందిన భక్తులు కారులో క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించి అనంతరం కొండపై ఫొటోషూట్ చేసుకునేందుకు ఆ ప్రాంతానికి వెళ్లారు, కారును వేసుకు రమ్మని ఓ వ్యక్తిని పురమాయించగా అతను యాక్సిలేటర్ నుంచి కాలు తీయకపోవడంతో కారు వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్‌తో పాటు కారు సైతం పాక్షికంగా ధ్వంసమైంది.

పోక్సో కేసులో ఒకరి అరెస్ట్

అత్తిలి, జూన్ 14 : అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన పసుపులేటి ఏసురాజు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణపై అరెస్టు చేశామని అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు. ఆరేళ్ల మైనర్ ఆడుకుంటున్న సమయంలో ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారం చేసినట్టు తెలిపారు. బాలికకు కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో తల్లి తెలుకుని అత్తిలి పోలీసులకు ఈనెల 9న ఫిర్యాదు చేసింది. దీనిపై తాడేపల్లిగూడెం డీఎస్పీ పీఎస్ఆర్ వీఎస్ మూర్తి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వి.రాంబాబు నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో హాజరుపర్చారు.

పేదల ఆకలి తీర్చిన చంద్రబాబు కోసం

- వెయ్యి మందికి సప్తగిరి హోటల్ యజమానుల అన్నదానం



అన్నదానం చేస్తున్న హోటల్ యజమానులు

లింగపాలెం, జూన్ 14: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలుపు పేదలకు వరమని, రూ.5లకే అన్న క్యాంటీన్‌లతో వేలాది మంది పేదల ఆకలి తీర్చారని హోటల్ యజమాని చెన్ను కొండలరావు, సోదరుడు చెన్ను శ్రీనివాసయాదవ్ తెలిపారు. లింగపాలెంలోని సప్తగిరి హోటల్ యజమానులైన వారు తమ హోటల్‌లో శుక్రవారం వెయ్యిమందికి పైగా ఉచితంగా అన్నదానం చేశారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి అన్నదానం చేసినట్టు వారు తెలిపారు.

సమాజానికి 'వేస్ట్ వెల్త్ ప్రాజెక్టు' ప్రయోజనకరం



ప్రాజెక్టు పత్రాలు అందిస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 14 : సమాజానికి శ్రేయస్సు కలిగించే వేస్ట్ వెల్త్ (ఉద్యాన వ్యర్థాల నుంచి సందప తయారీ) ప్రాజెక్టు ప్రయోజనకరమని ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పేర్కొ న్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో గోదావరి క్లస్టర్ యూనివర్శిటీల ద్వారా తగిన సాంకేతికత అభివృద్ధి చేసేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఏపీ ఎన్ఐటీ, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలు కలిసి చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పత్రాలను ఆయన శుక్రవారం బాధ్యులకు అందించి మాట్లాడారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్వహిం చేందుకు ఈ ప్రాజెక్టు ఎంపిక అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సులోమి సునీత, ఏపీ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ టి.జగన్‌మోహనరావు, నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ టి.విజయనిర్మల ప్రాజెక్టు పత్రాలు అందుకున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు డీవీ స్వామి, ఎస్.సూర్యకుమారి పాల్గొన్నారు.

శ్రీవారికి ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ పూజలు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎంపీ మహేష్‌కుమార్

ద్వారకాతిరుమల, జూన్ 14: చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన బంగారువాకిలి మీదుగా లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందించారు. ఆలయ ఈవో వి.త్రినాథరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. టీడీపీ నేతలు ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి యాదవ్, రేపూరి వెంకటేశ్వరరావు, నందిగం బాబి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కోళ్ల వ్యర్థాలు

చేపల చెరువులకు మేతగా తరలింపు.. పట్టించుకోని అధికారులు



భీమడోలు శివారు బోదెలో పడిన కోళ్ల వ్యర్థాలను వ్యానులోకి ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

భీమడోలు, జూన్ 14 : భీమడోలు మండలంలోని చేపల చెరువులకు కోళ్ళ వ్యర్థాల వినియోగం విచ్చలవిడిగా మారింది. మండల వ్యాప్తంగా ఉన్న చేపల చెరువులకు మేతగా కోళ్ల వ్యర్థాలను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. భీమడోలు, కురెళ్ళగూడెం, అంబర్‌పేట, కొల్లేరు గ్రామాలకు రోజుకు పది నుంచి పదిహేను వాహనాల ద్వారా నిత్యం ఈ వ్యర్థాలను తరలిస్తున్నారు. మండలంలోని వైసీపీకి చెందిన మండల ప్రజా పరిషత్ ప్రతినిధి కనుసన్నల్లో వ్యర్థాలు తరలిస్తున్నట్టు సమాచారం. హోం గార్డు నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు వ్యర్థాల తరలింపునకు ఒకొక్కరికి ఒక్కోవిధంగా ముడుపులు నెలవారీ అందజేస్తున్నట్లు తెలిసింది. చేపల మేతకు కోళ్ల వ్యర్థాల వినియోగం నిషేధమైనప్పటికీ యథేచ్ఛగా పట్టపగలు తరలించేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలు తరలించే సమయంలో అదుపు తప్పి పంట పొలాలు, బోదెలలో పడి దుర్గంధం వ్యాపిస్తున్నప్పటికీ సంబంధిత రైతులు, వాహనదారులపై చర్యలు మాత్రం శూన్యం. ఈ వ్యర్థాల తరలింపుపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


గిరిజన రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

జీలుగుమిల్లి, జూన్ 14 : రైతులను ఆదుకునేందుకు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి సొసైటీ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందజేశారు. ఎంటీయూ 1064, ఎంటీయూ 1061 వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఇటీవల ఎక్కువ శాతం రైతులు వేరుశనగ పంట సాగు చేస్తున్నారని, విత్తనాలు అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా రాయితీపై వేరుశనగ విత్తనాలు అందించడానికి కృషి చేస్తామన్నారు. మండలంలో 1205 మంది గిరిజన రైతులు 2647 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు ఏడీఏ పీజీ..బుజ్జిబాబు చెప్పారు. ఏవోలు కె.గంగాధరం, చెన్నకేశవులు, ముత్యాలరావు, పసుపులేటి రాము, పసుపులేటి కృష్ణమోహన్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు లావణ్య కనకదుర్గ, మాదవి, మధురవాణి, విద్య, రాములమ్మ, రఘు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ఏలూరు టూటౌన్, జూన్ 14: విద్యార్థులు క్రమశిక్షణ తో మెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చడానికి విద్యార్థులు ఎంతో కృషి చేయాలన్నారు. విద్యార్థులు పలు రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ అబ్రహం, సోమశేఖర్, రవిప్రకాశ్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పెదపాడు: పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూర్చి విద్యా బోధనకు ఆటంకం లేకుండా చూడాలని ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి ఉపాధ్యాయులకు సూచించారు. రామచంద్రపురం ప్రాథమిక పాఠశాలలో వసతులను, విద్యార్థుల హాజరు శాతం, బోధనాంశాలను పరిశీలించి, ఉపాధ్యాయులు సూచనలు చేశారు. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో అన్నమ్మ, హెచ్ఎం శర్మ అన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో భూమి, నీరు, నేల, చెట్టు అంశాలపై సైన్స్ ఉపాధ్యాయులు రాధాకృష్ణ, మజీద్ ఖాన్, గ్రామదీప్ సంస్థ చైర్మన్ వెలమాటి మనోహరి ఆధ్వర్యంలో శుక్రవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. జీవ విధానంతో మొక్కలను పెంచాలన్నారు. హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు

నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

కుక్కునూరు, జూన్ 14: 'నేను బడికి పోతా' కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంఈవో గిరి భగవాన్‌దాస్ ఉపాధ్యాయులకు సూచించారు. కుక్కునూరులో శుక్రవారం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు ఉండాలని, పాఠశాల పరిశుభ్రతపై ప్రత్యేక దృషి సారించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల నమోదు శాతం పెంచాలని సూచించారు.

జిల్లాలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 14: జిల్లాలో నేరనియంత్రణ చర్యల్లో భాగంగా రాత్రివేళ పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటీఎం, దేవాలయాలు, చర్చి, మసీదుల వద్ద గస్తీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రివేళ లాడ్జిలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలను చేపట్టినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

చెగువేరా బాటలో పయనించాలి


చెగువేరా చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు టూటౌన్, జూన్ 14: పోరాట యోధుడు చెగువేరా బాటలో పయనించాలని ఏవీఆర్.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు అన్నారు. విజ్ఞాన కేంద్రంలో చెగువేరా జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ కోర్సు జరిగిన చెగువేరా సమాజానికి వైద్యం చేశారన్నారు. అమెరికా వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటాలకు ప్రేరణ కలిగించారన్నారు. చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయి సిద్ధార్థ, రత్నంరామ్, హారిక, రేష్మ, విజయ్‌కుమార్, రాజ్, విజయకృష్ణ, నవీన్, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య


కె.కోటలో అంగన్‌వాడీల ప్రచార ర్యాలీ

కామవరపుకోట, జూన్ 14: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా అన్నారు. కామవరపుకోటలో అంగన్‌వాడీ చిన్నారులతో శుక్రవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, తద్వారా వారికి శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని, విజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీవీఎల్.మంగాదేవి, అంగన్‌వాడీలు భాగ్యలక్ష్మి, సువర్ణకుమారి, ఎస్తేరు, విజయకుమారి, రాణి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 14: నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు, లస్కర్ల సమస్యలను మంత్రి బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడు పరిష్కరించాలని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం, ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ కోరారు. కొత్తగా నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై రామానాయుడిని శుక్రవారం వారు అభినందించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రాష్ట్రప్రగతిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

వేలేరుపాడులో భారీ వర్షం

వేలేరుపాడు, జూన్ 14: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు భానుడి ప్రతాపంతో అల్లాడిపోయిన జనం వర్షంతో ఉపశమనం పొందారు. సుమారు అరగంట సేపు భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. వారంతపు సంతలో పలువురు ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు అమ్మకానికి ఉంచిన సరుకులు తడిచి ముద్ద య్యాయి. ఇప్పటి వరకు పెద్దగా వర్షం కురవకపోవడంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. వేసవి దుక్కులు చేసుకునే వీలు లేక రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో భారీ వర్షం కురవడంతో రైతులు సాగుకు సన్నద్ధం కానున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి


గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఎంపీ మహేష్ పూజలు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చింతమనేని


మంత్రి పార్థసారథికి పుష్పగుచ్ఛం ఇస్తున్న చింతలపూడి నేతలు

హామీలు అమలు చేస్తాం

ఏలూరు ఎమ్మెల్యే చంటి, ఎంపీ పుట్టా మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 14: ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చేసిన వాగ్దానాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రధాన హామీల అమలుకు సంతకం చేశారన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ రూ4వేలకు పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ సీఎం ఐదు సంతకాలు చేశారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే వాగ్దానాలు నెరవేరుస్తూ ప్రారంభించామన్నారు. ఐటీ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఐటీ, విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి విజయంలో యువత ముఖ్యపాత్ర వహించారని, ఉపాధి కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యే బడేటి చంటికి తూర్పుకాపులు అభినందనలు తెలిపారు. బడేటి క్యాంపు కార్యాలయంలో జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుతో కలిసి చంటిని సన్మానించారు. తూర్పుకాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బలగం సేతుబందు సీతారామ్, పి.మహేష్, పి.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలసిన ఉపాధ్యాయ నేతలు

ఏలూరు ఎడ్యుకేషన్: నూతనంగా ఎన్నికైన ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్‌ను యూటీఎఫ్, పీఆర్టీయూ జిల్లా నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలన్నారు. టీచర్ల ఆకాంక్షల మేరకే ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. ఆంజనేయులు, రవికుమార్, సుబ్బారావు, రంగమోహన్, కమల్‌కుమార్, రాజారావు, మోహన్‌రావు తదితరులున్నారు.

ఆరు నెలల్లో ప్రతి హామీ నెరవేరుస్తాం

బుట్టాయగూడెం: ప్రతి హామీని ఆరు నెలల్లో నెరవేర్చేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ తెలిపారు. గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎంపీకి ఈవో ఆకుల కొండలరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ మాట్లాడుతూ తొలి ఐదు సంతకాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాచరణకు దిగారన్నారు. పార్లమెంటు పరిధిలో యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని యువత వ్యక్తిగత సమాచారాన్ని తమ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. పరిశ్రమలు తేవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రహదారుల మరమ్మతులకు కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, పార్లమెంటులో ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై మాట్లాడతానన్నారు. ఘంటా మురళి రామకృష్ణ, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, రావూరి కృష్ణ, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, పగడం సౌభాగ్యవతి, కొప్పాక శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో జంగారెడ్డిగూడెం పట్టణంలో బొగవల్లి రత్నాజి, కుటుంబ సభ్యులు గంగానమ్మకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం

కామవరపుకోట: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తానని, మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. తాడిచర్ల రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని, దశల వారీగా వనరులు సమకూరుతాయని మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. వేముల హనుమంతు, అబ్బూరి సత్య ప్రకాశరావు, యలమర్తి శ్రీను, అబ్బూరి గంగాధరరావు, అబ్బూరి రత్నరావు, జోనుబోయిన అబ్బులు, తదితరులు ఉన్నారు.

● పోలవరం: ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ని పోలవరం టీడీపీ నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. బొడ్డు కృష్ణ, తెల్లం సూర్యచంద్రం, చాపర్ల వెంకటాచలం, మజ్జి అప్పారావు, పిల్లి నాగరాజు, ఉండ్రాజవరపు మూర్తి, వాడపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొలుసు పార్థసారథిని కలసిన జనసైనికులు

చింతలపూడి: జనసేన నాయకులు పి.నాగవిజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ఏలూరులో కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట కురిసిన శ్రీనివాసరావు, ఈశ్వరుడు, పసుపులేటి శ్రీనివాసరావు, వి.యోబు, దుర్గారావు, సింగంశెట్టి శివకుమార్ తదితరులు ఉన్నారు.

మాట నిలబెట్టుకుంటాం : చింతమనేని

దెందులూరు: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి మాట నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు అన్నారు. దెందులూరు ఎన్టీఆర్ సెంటర్‌లో చింతమనేని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికి రుణపడి ఉంటానన్నారు. యిప్పిలి వెంకటేశ్వరావు, పెనుబోయిన శేషారత్నం, గారపాటి కొండయ్యచౌదరి, సంపంగి వేణుగోపాలతిలక్, సర్పంచ్ తోట ఏసమ్మ, పెనుబోయిన మహేష్ యాదవ్, దాసే శ్రీను, కొలుసు నాని, మిల్లుబాబు, మోతుకూరి నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. జడ్పీ సీఈవో కెఎస్ఎస్.సుబ్బారావు, డీబీఆర్‌సీ డివిజన్ కోఆర్డినేటర్ బీహెచ్ఎస్వీకృష్ణంరాజు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కుమరేశ్వరన్. మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ పీవీఎల్.పద్మావతి, సీడీపీవోలు విజయలక్ష్మి, సునీల్ రాజశేఖర్, పద్మావతి తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకరంగా కలిశారు.


ప్రభుత్వాసుపత్రిలో రక్తదాతలకు సత్కారం


బులియన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం


ఆశ్రం ఆస్పత్రిలో విద్యార్థుల రక్తదానం

ఒకరి రక్తదానం ఇద్దరికి ప్రాణదానం

ఏలూరు క్రైం, జూన్ 14: ఒకరి రక్తదానంతో ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆగ్నస్ విజయ అన్నారు. ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ ఆగ్నస్ విజయ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వారు రక్తదానం చేయవచ్చన్నారు. ప్రమాదాల్లో క్షతగాత్రులు, ఆపరేషన్ చేయించుకున్నవారు, గర్భిణులకు రక్తం అవసరం అవుతుందని, ఎంతో మంది దాతలు రక్తదానం చేస్తున్నారని వారే పరోక్షంగా వారి ప్రాణాలు కాపాడినవారేనని అభినందించారు. ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 118 సార్లు రక్తదానం చేసిన సూర్యనారాయణ, 11 సార్లు రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, లోకేశ్ కుమార్‌ను సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ దుర్గా కుమార్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్‌జ్యోతి, డాక్టర్ శశికళ, కో ఆర్డినేటర్ జయలక్ష్మి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రాణాపాయంలో వున్న వారికి సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలలో భాగస్వాములైన పలువురు దాతలకు, అధికార, అనధికారులకు, సిబ్బందిని ఆయన సత్కరించి మెమొంటోలను అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ, డీసీహెచ్ఎస్ పాల్‌సతీష్, ఆలపాటి నాగేశ్వరరావు, హౌసింగ్ డీఎం రవికుమార్, సెట్వెల్ సీఈవో మెహర్రాజ్, ప్రభుత్వాసుపత్రి వైద్యులు, దాతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మన మధు అన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా అసోసియేషన్, లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్‌క్లబ్, వంగాయిగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50మందికి పైగా రక్తదానం చేశారు. సత్యనారాయణ, కనిగొళ్ళ మల్లికార్జున్, కడియం ప్రసాద్, వినీల్, రాజు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని ఆశ్రంఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ శాంతయ్య అన్నారు. ఆశ్రం వైద్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో హార్ట్‌స్పెషలిస్టు డాక్టర్ అమ్మిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఏలూరు రూరల్, జూన్ 14: నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందుతాయని, పరిసరాల పరిశుభ్రతతో దోమలను నిర్మూలించవచ్చని మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకృష్ణ ఆధ్వర్యంలో చాటపర్రు దళితవాడలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల ఈగలు, దోమలు పెరిగి అనేక రోగాలు ప్రబలుతాయని తెలిపారు. నీటి నిల్వ తొట్టెలు, డ్రమ్ములు, పూలకుండీలు, పగిలిన ప్లాస్టిక్ వస్తువులు, ప్రాంతాల్లో దోమలు పెరుగుతాయని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరోగ్యవిస్తరణాధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, సంధ్యారాణి, ఎం.శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యశిబిరం నిర్వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అనారోగ్య సమస్య ఎదురైతే దగ్గర్లోని ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. ఏఎన్ఎం, ఆశాలు, వైద్య సిబ్బంది ప్రతిరోజూ తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని, ఎవరైనా అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది

ఉంగుటూరు, జూన్ 14: మలేరియా నిర్మూలనపై చేబ్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్ రెడ్డి మాటాడుతూ చలి, జ్వరంతో బాధపడుతున్న వారు మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వైవీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలనకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రత్నరాజ్యం, సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, కె.గంగాధరరావు, ఆశాలు ఆరోగ్య కార్యకర్తలు కె.శ్రీనివాసరావు, వేణుస్వామి, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ఏలూరు టూటౌన్, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంపై రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఐదు సంతకాలు పెట్టిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పంట పెట్టుబడుల కొరకు రైతులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించాలని అన్నారు.

● ఏలూరు రూరల్: ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ హర్షం ప్రకటించారు. ఈ చట్టాన్ని రద్దుచేయాలని గతంలోనే దళితసేన డిమాండ్ చేసిందన్నారు. ఈ చట్టంతో బడుగు, బలహీనవర్గాలు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా న్యాయవాద వృత్తికి నష్టం చేకూరుతుందన్నారు.

రాట్నాలమ్మ ఆలయానికి రూ.1.11 లక్షలు విరాళం


విరాళం అందిస్తున్న భక్తులు

పెదవేగి, జూన్ 14: పెదవేగికి చెందిన మూల్పూరి పూర్ణచంద్రరావు లలితకుమారి దంపతులు రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయానికి రూ. 1,11,555 విరాళాన్ని అందించారు. శుక్రవారం ఉదయం అమ్మవారిని దర్శించుకున్న పూర్ణచంద్రరావు దంపతులు విరాళం సొమ్మును ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, పూర్ణయ్య శర్మకు అందించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాట్నాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అనువుగా సహాయాన్ని అందించామన్నారు.

కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



ద్వారకాతిరుమల, జూన్ 14: కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని ఈవో త్రినాథరావు తెలిపారు. ఆలయాన్ని పూలదండలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణను ప్రధాన అర్చకుడు పుసులూరి భైరవ నేతృత్వంలో జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు టూటౌన్, జూన్ 14: కావూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైపు, కంప్యూటర్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పీఆర్వో పులి శ్రీరాములు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీ, ఇంటర్ కామర్స్ ఉత్తీర్ణులకు వారికి టాలీలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో అడ్మిషన్లు ఇస్తామన్నారు. 17 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఏలూరు, పరిసర గ్రామాల్లోని 35 ఏళ్లలోపు యువత ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు.

రేషన్ బియ్యం విక్రయం : కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉంగుటూరు, జూన్ 14: చేబ్రోలులో బెల్ కంపెనీ పేరుతో రేషన్ బియ్యాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని రేకపల్లి వెంకట నరసింహ నాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న చేబ్రోలులో తన్నీరు కిషోర్ మోటార్‌సైకిల్‌పై మూటలు తెచ్చి సోనామసూరి బియ్యం అని చెప్పి రెండు బస్తాల బియ్యం విక్రయించాడన్నారు. అవి రేషన్ బియ్యంగా గుర్తించామన్నారు. అతడి ఫోన్ నెంబరు పనిచేయడం లేదని ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

రైతు కూలీ సంఘం ప్రచార జాతా

ఏలూరు టూటౌన్, జూన్ 14: రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పవర్‌పేటలో శుక్రవారం ప్రచార జాతా నిర్వహించారు. కళాకారుల డప్పులు, నృత్యాలతో ఆర్ఆర్.పేట, ప్రభుత్వాసుపత్రి వరకు ప్రదర్శన సాగింది. జిల్లా కార్యదర్శి బాషా మాట్లాడుతూ మహాసభల్లో రైతు సమస్యలను చర్చించి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వర్మ, ఎస్.లలితకుమారి పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు


లింగపాలెంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

లింగపాలెం, జూన్ 14: లింగపాలెంలో ఆర్టీసీ బస్సు మొరాయించింది. ఏలూరు నుంచి చింతలపూడివైపు వెళుతున్న బస్సు సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. ఇటీవల ఏలూరు డిపో బస్సులు తరచూ ఆగిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రూట్‌లో పాత బస్సులతో ఇబ్బందులకు గురవుతున్నట్లు వారు తెలిపారు. కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు తెలిపారు.

పవన్‌కు మంత్రిత్వ శాఖల కేటాయింపుపై హర్షం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 14: రాష్ట్ర మంత్రివర్గంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదాతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు కేటాయించడంపై జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేసి వేడుక జరిపారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో ప్రజలకు మంచి పరిపాలన అందుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఏపీ అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. సిరిపల్లి ప్రసాద్, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, బొత్స మధు, వీరంకి పండు, అల్లు సాయిచరణ్, శ్రావణగుప్త, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీపై సీఎం తొలి సంతకం హర్షణీయం

టి.నరసాపురం, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడం హర్షణీయమని తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులతో కలిసి తెలుగు యువత అనేక పోరాటాలు చేసినప్పటికి గత ప్రభుత్వం స్పందించలేదని ఆయన తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 16,347 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం తమ పోరాటానికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పరిపాలనలో రాష్ట్ర సర్వతోముకాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఈ నెల 16న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో బాలుగారి గానామృతం ఆడియో ఆవిష్కరిస్తున్నట్లు సినీ సంగీత దర్శకుడు ఎస్పీఎస్ వాసు తెలిపారు. జయంతి ఉత్సవం, తదుపరి సినిమా పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. గాయనీ గాయకులను ఎంపిక చేస్తామని తెలిపారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనను జరిపించారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయం, బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో సామూహికంగా కుంకుమ పూజలు చేశారు.
- **ఏలూరు రూరల్ :** అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈనెల 16న ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల నిపుణులు కంటి పరీక్షలు చేస్తారన్నారు.
- **కామవరపుకోట :** లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు పూజలు చేయించారు.
- ఎన్నికల హామీల్లో భాగంగా వృద్ధులు, వితంతువులు, కార్మికులు, కళాకారులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించడంపై ప్రజా నాట్య మండలి జిల్లా ప్రతినిధి టీవీఎస్..రాజు హర్షం వ్యక్తం చేశారు. కళాకారులకు కూడా పెన్షన్ పెంపుదల చేయాలని కోరారు.
- **చింతలపూడి :** మండలంలోని 26 రైతుభరోసా కేంద్రాల్లో 140 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఏవో మీనాకుమారి తెలిపారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అన్ని రకాలు ఉన్నాయన్నారు
- **పెదపాడు :** టీడీపీ నేత బొప్పన బాబ్జి మాతృమూర్తి వరలక్ష్మీదేవి (85) గురువారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాబ్జి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.
- **వేలేరుపాడు :** జుమ్మా మసీదు నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సదర్‌గా ఎస్‌కే.జహీర్, నాయబ్ సదర్‌గా ఎండీ. జాఫర్‌ఖాన్, సెక్రటరీగా ఎస్‌కే.కాజామోహిద్‌లను ఎన్నుకున్నారు.
- **భీమడోలు :** జడ్పీ హైస్కూలులో శనివారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు హాజరు కావాలని కోరారు.
- **ద్వారకా తిరుమల :** ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణను సత్తాల గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు, ఎంపీగా దగ్గుపాటి పురందేశ్వరి ఘనవిజయం సాధించడానికి లంకా చేసిన కృషి అభినందనీయమన్నారు. మటపర్తి రూపేష్‌కుమార్, పాతూరి సహృదయ్, ఏపూరి కిషోర్, బాదిన సత్యనారాయణ, పరంజ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

నూజివీడు టౌన్, జూన్ 14: ప్రజల ఆస్తి హక్కుకు భంగం కలిగించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 2022ను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ఈ నల్ల చట్టంతో వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేసిందన్నారు. దాదాపు 3 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమించినా వైసీపీ ప్రభుత్వం చలించలేదని, చంద్రబాబునాయుడు హామీ మేరకు సంబంధిత చట్టాన్ని రద్దుచేస్తూ జీవో విడుదల చేయడం పట కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్ వద్ద స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. భారత్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి బసవరాజు రామకృష్ణ, వైఎస్ దొర్రై, వాకా రాజ్‌కుమార్, సయ్యద్ ఫరూక్, దేవినేని సూర్యనాథ్, దార్ల కుమారి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: సీఎం చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంపై సామాజిక కార్యకర్తలు ఎల్ఎస్ భాస్కరరావు, టి. అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండవల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ చట్టాన్ని రద్దు చేయడం అభినందనీయమన్నారు.

మరణానంతరం భౌతిక దేహాల దానానికి నిర్ణయం



నూజివీడు టౌన్, జూన్ 14: మరణానంతరం తమ భౌతిక దేహాలను ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి దానం చేస్తూ నూజివీడు సీపీఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ దంపతులు నిర్ణయం తీసుకున్నారు. మెడికల్ కాలేజ్ అనాటమీ విభాగానికి డాక్యుమెంట్లను సమర్పించారు. నూజివీడు సీపీఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, ఆయన సతీమణి శశికళకు సంబంధిత డొనేషన్ డాక్యుమెంట్‌లను అందించారు.

కార్మికుల క్లెయింలు పరిష్కరించాలి

నూజివీడు టౌన్, జూన్ 14: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించి పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయింలను పరిష్కరించాలని, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి మానికల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నూజివీడులో ఐఎఫ్‌టీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి మానికల నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి తీసుకున్న నగదును జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైం సమాచారం

పట్టపగలు చోరీ

చాట్రాయి, జూన్ 14: మండలంలోని బూరుగ్గూడెంలో పట్టపగలు చోరీ జరిగింది. వంగాల మాధవరెడ్డి గురువారం నరసింహారావుపాలెంలో బంధువుల ఇంట ఫంక్షన్‌కు వెళ్ళి తిరిగి వచ్చేసరికి ఇంట్లోని సుమారు 7 కాసుల బంగారు నగలు, సుమారు అర కిలో వెండి సామాన్లు చోరీ అయినట్లు గుర్తించి చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ గజపతిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిదిండి, జూన్ 14 : కొళ్లపాలేనికి చెందిన అల్లాడి నాగరాజు ఇల్లు శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఇంట్లో వస్తు సామాగ్రి, దుస్తులు, రేషన్, ఆధార్ కార్డులు, నగదు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. కైకలూరు ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. తహసీల్దార్ దశిక వంశీ, వీఆర్వో కోకా చంద్రశేఖర్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.





మంత్రి పార్థసారథికి ముసునూరు, చాట్రాయి మండలాల టీడీపీ నాయకుల అభినందన

మంత్రి పార్థసారథికి తెలుగు తమ్ముళ్ల అభినందన

ముసునూరు, జూన్ 14: నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని శుక్రవారం విజయవాడలో టీడీపీ మండల నాయకులు కలసి అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ధలరామ్, ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, మాజీ ఎంపీపీ మసిముక్కు సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జియ్య, ఉపాధ్యక్షులు పర్వతనేని శ్రీనివాసరావు, నాయకులు కాటేపల్లి శ్రీనివాసరావు, కాటేపల్లి నాగేశ్వరరావుతో పాటు గోపవరం గ్రామానికి చెందిన తెలుగుయువత పార్థసారథిని సన్మానించారు.

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని శుక్రవారం విజయవాడలో చాట్రాయి మండల టీడీపీ నాయకులు బొంతు సత్యనారాయణ, కందుల కృష్ణ, నాగేశ్వరరావు, ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెన్షనర్లతో కూటమి నేతల సంబరాలు



ముదినేపల్లి, జూన్ 14 : పెన్షన్ల పెంపుపై సీఎం చంద్రబాబు సంతకం చేసిన నేపథ్యంలో శుక్రవారం ముదినేపల్లిలో తెలుగుదేశం, జనసేన నాయకులు పెన్షనర్లతో కలసి సంబరాలు జరిపారు. వృద్ధులకు స్వీట్లు తినిపించారు. ప్రధానమైన ఐదు హామీల అమలుకు చంద్రబాబు నాయుడు సంతకాలు చేయటం హర్షణీయమని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, కో- కన్వీనర్ తేరా రమేష్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు అన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపుపై వేంపాటి హర్షం

కలిదిండి: సీఎం చంద్రబాబు దివ్యాంగుల పెన్షన్ పెంపుపై టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపాటి ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు ప్రకటించటం దివ్యాంగుల పాలిట వరమన్నారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీరాజ శ్యామల హోమం



కైకలూరు, జూన్ 14: లోక కల్యాణా ర్థం శ్రీ లక్ష్మీ గణపతి, మహచండి, శ్రీరుద్ర సహిత ఆదిత్యాది నవగ్రహ నక్షత్ర సహిత రాజశ్యామల హోమాన్ని శుక్రవారం కైకలూరు శ్యామలాంబ ఆలయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య దంపతులు నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అడవి కృష్ణ, ముత్తంరాజు శర్మ, వీవీ ఫణికుమార్, గూడురు హనుమంతరావు, వారణాసి దుర్గాసారథి, ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

కైకలూరు, జూన్ 14: కైకలూరులో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో దోమల మందు పిచికారీ చేశారు. సబ్‌యూనిట్ అధికారి పీఎస్ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హాస్టల్స్‌ను శుభ్రం చేసి దోమల మందు స్ప్రే చేశారు. హాస్టల్ వార్డెన్లు ఆర్ రవిప్రసాద్, ఎం రాధా, సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఎ తాతారావు, కె రామారావు, ఎం దుర్గమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే 1098కు తెలపండి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి లక్ష్మి

కైకలూరు, జూన్ 14: బడి ఈడు పిల్లల్ని పాఠశాలలకు పంపాలని, పనులకు పంపడం నేరమని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. శుక్ర వారం కైకలూరు జడ్పీ ఓరియంటల్ హైస్కూల్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ పిల్లలను పనులకు తరలిస్తే చైల్డ్ లేబర్ చట్టప్రకారం 3 నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష ఉంటుందని, ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే 1098 నంబరుకు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. స్కూల్ హెచ్‌ఎం శ్రీకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయిసత్యనారాయణ, ఎంఎస్ఎస్ రాజు, పి. పవన్‌కాంత్, డి. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ముదినేపల్లి, జూన్ 14 : ముదినేపల్లికి చెందిన షేక్ షఫీ కుమార్తె షేక్ షబీన అనే విద్యార్థినికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు స్థానిక బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్టు ద్వారా టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. షేక్ మహ్మద్ రియాజ్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, జూన్ 14: మర్లపాలెం, సోమవరం, కొత్తగూడెం, యర్రవారిగూడెం గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సంజయ్ తెలిపారు.

కూటమితోనే కొల్లేరు సమస్య పరిష్కారం : బలే



మండవల్లి, జూన్ 14: వైసీపీ తన స్వప్రయోజనాలకే కొల్లేటి ప్రజలను వినియోగించుకుందని కూటమితోనే కొల్లేరు సమస్య పరిష్కారమవుతుందని టీడీపీ కొల్లేరు సాధికార రాష్ట్ర చైర్‌పర్సన్ బలే ఏసురాజు అన్నారు. ఎన్డీయే విజయంపై కొల్లేటి గ్రామాల టీడీపీ శ్రేణులు శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమా వేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేటి లంక గ్రామాల్లో కూటమి విజయానికి విశేష కృషి చేసిన బలే ఏసురాజును లంక గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ నిర్మల, మల్లికార్జున, కొల్లేటిలంక గ్రామపెద్దలు ముంగర కొండలు, శంకరరావు, జయమంగళ సుబ్బరాజు, సర్పంచ్ సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.







ముసునూరు నుంచి తెలుగు యువత.. చీపురుగూడెం నుంచి టీడీపీ కార్యకర్తలు ద్వారకా తిరుమలకు.. జనార్దనవరం నుంచి పెనుగంచిప్రోలు టీడీపీ నాయకుల పాదయాత్ర

మొక్కు తీర్చుకునేందుకు ఆలయాలకు కాలినడకన...

ముసునూరు, జూన్ 14: కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించడంతో పాటు నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి మంత్రి పదవి దక్కడంతో ముసునూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన తెలుగు యువత శుక్రవారం ద్వారకా తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. జగన్, అర్జున్‌రావు, ఏడుకొండలు తమ మొక్కును తీర్చుకునేందుకు ద్వారకాతిరుమల పాద యాత్రగా బయల్దేరి వెళ్లారు. రాష్ట్రం చంద్రబాబుపాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు సంక్షేమపథకాలు సమర్థవంతంగా అమలు జరుగుతాయని వారు ఆకాంక్షించారు.

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్ గెలుపొంది, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడితే కాలినడకన ద్వారకా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తామని చీపురుగూడెం టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. శుక్రవారం టీడీపీ నాయకులు బొట్టు లక్ష్మణరావు, మందలపు జగదీష్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు గోవింద నామస్మరణ చేసుకుంటూ ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్లారు.

పెనుగంచిప్రోలుకు...

నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్ గెలుపొంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దర్శనానికి వస్తామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, స్థానిక నాయకుడు కొనకాల గోపాలకృష్ణ మొక్కుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం జనార్దనవరం ఎన్టీఆర్ విగ్రహం నుంచి వీరు కాలినడకన పెనుగంచిప్రోలు బయలుదేరి వెళ్లారు.